
ఈవారం కథ

# పాయితోలే మనుషులు

## పాటిబండ్ల రజని




"అమ్మ దొంగా నిన్ను చూడకుంటే నాకు బెంగ"
పండగకు తీసుకువెళ్ళేందుకు నాన్నగారు వచ్చినప్పట్నుంచీ, ఒక వారమైనా అమ్మదగ్గర వుండవచ్చు అని పులకించిన ప్పట్నుంచీ, బాలసరస్వతి నాలోనే కచేరీ పెట్టినట్లు ఆ పాట అదేపనిగా హమ్ అవుతూనే వుంది. దివ్య తాతగారి ఒళ్ళో చేరి వచ్చీరాని మాటల్తో పాడుతున్న రైమ్స్ వినిపిస్తున్నాయి వరండాలో నుంచి.

ఏం అన్నయ్యగారూ ఐదు నెల లైనా రాకముందే అమ్మాయిని పురిటికి తీసుకువెళ్ళేందుకు వచ్చారా ఏం? పక్కింటి కమలమ్మగారు హాస్యంగా అన్నారు నాన్నగారితో.

అబ్బే! మా కోడలూ నీళ్ళోసుకుందమ్మా! ఇప్పట్నుంచే అమ్మాయిని తీసుకువెళితే ఆ అమ్మాయి మీద భారం వేసినట్టనుకుంటారంతా! ఈసారికి అమ్మాయిని నెలలు నిండాకే తీసుకువెళ్ళి ఆ ఒక్క బాధ్యతా తీర్చుకుంటే ఎక్కడిక్కారక్కడ ధన్యమైనట్టే లెక్క!

లెక్కల మాష్టారైన నాన్నగారు చెబుతున్న లెక్క వినేందుకు కమలమ్మగారికి ఎలా వున్నా, నాకు మాత్రం హుషారంతా ఊదేసినట్టయింది.

కూతురికి ప్రేమతో చేయవలసిన పనులు కూడా బరువుగా తోస్తున్న నాన్న కోడలి విషయం అంత బాగా ఎలా ఆలోచించగలిగారో అర్థంకాలేదు. అంతలోనే నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నప్పుడు జరిగిన విషయమొకటి గుర్తొచ్చింది!

ఊళ్ళోనే వున్న ఓ మంచి సంబంధం గురించి నాన్నగారితో చెప్పాడు సుబ్బారావు మావయ్య. నాన్న దాని గురించి ఏ మాత్రం ఆలోచించకుండానే, చూడు సుబ్బారావు, ఆడపిల్లని ఆమడదూరానా, మగబిడ్డను మంచం పక్కనా వుండేలా చూసుకోమన్నారు పెద్దలు. పైగా ఆడపడుచు వుండేది ఊళ్ళోనే అంటే, పిల్లాడికి పిల్లనిచ్చేందుకు కూడా జంకుతారయ్యా! దూరాన వుంటేనే ప్రేమలు! అందుకే వెళ్ళి ఆ వేములపల్లి సంబంధం మాట్లాడివద్దూ! అన్నారు.

మొన్న మొన్నటి వరకూ పక్కనే పడుకోబెట్టుకున్న నాన్న, నెలపొడుపు చూడగానే అమ్మలూ అంటూ పిలిచి మొహం చూసే నాన్న, ఏ సీజన్లో ఆ పూలతో పూలజడ వేయించి ఫోటోలు తీయించిన నాన్న, ఆ నాన్నే దేశ బహిష్కారమంత పెద్ద శిక్ష విధించబోతుంటే ఎవరు కాపాడతారో అర్థంకాలేదప్పుడు నాకు!

ఇప్పుడిప్పుడే ఆరో తరగతి సైన్సులో చదువుకున్న "ఉక్కు ముక్కను అయస్కాంతంతో సవ్యదిశలో పదేపదే రుద్దితే ఉక్కుముక్క అయస్కాంతంగా మారుతుంది" అని చదువుకున్న పాఠం, నీ ఇల్లు–మా ఇల్లు, నీ సామాను– మా సామాను, మీ ఇంటి పేరు – మా ఇంటి పేరు, నీ హక్కులు – మా బాధ్యతలు అంటూ పదే పదే రుద్దుతుంటే, ఉక్కు ముక్క అయస్కాంతంగా మారి ఎలా అతుక్కోవాలో అర్థమవుతుంది.

ఆకలవుతుంది అన్నం పెట్టమ్మా అని దివ్య వచ్చి చేయిలాగిందాకా ఈ లోకంలోకి రాలేకపోయాను!

* * *

ఇంటికి వెళ్ళగానే కనిపిస్తుందని అనుకున్న అమ్మ, తన ఆత్రుత కోడలి ముందు బయటపడడం ఇష్టంలేక కాబోలు చేతిలోని పని తాపీగా చేసుకొని మరీ వచ్చి, ఏవిటే బొత్తిగా అలా చిక్కిపోయావ్? మీ ఆడపడుచులు రోగం రొష్టూ అంటూ ఇంటి మీద పడ్డారా ఏం? అంది మొహం చిట్లిస్తూ! మరోప్పుడైతే నా జవాబు ఎలా వుండేదోగాని, నా జవాబు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న వదినను చూడగానే, నా రాకను గురించి వదిన కూడా ఇలానే అనుకుంటుందా? అమ్మ మాటలకైనా అలాంటి ఆలోచన తనకు రాదా? అనుకోగానే ఒకే రకం అత్తలూ, ఒకే రకం కోడళ్ళు తరతరాలుగా ఒకే రకంగా ఎలా తయారవుతున్నారో అర్థమయినట్టయింది నాకు!

ఏం! వాళ్ళ తమ్ముడింటికి వచ్చే హక్కు ఆ మాత్రం లేదేమిటి. నువ్వు మరీను! అనడంతో – సీన్లు సీన్లుగా వినాలనుకున్న విశేషాలకు కరంటు పోయినట్లయిందనుకుంటాను ఇద్దరికీ! విచిత్రంగా చూస్తూ అమ్మ ఏదో అనేలోపే దివ్య వచ్చి అమ్మమ్మ మెడను పెనవేసుకుంటూ, అమ్మమ్మా, అమ్మమ్మా మీ ఇంట్లో ఊగే ఉయ్యాల బల్ల మాకిస్తావా? అంది గారాంగా!

ఓసి భడవా! మీదీ మాదీ అంటూనే అన్నీ చేరేద్దామనే! నాయనమ్మ పోలికలు బాగానే వచ్చినట్టున్నాయి. మురిపెంగా అంటూ ముద్దులాడుతుంది అమ్మ.

ఊహ తెలిసినప్పటి నుంచీ వాళ్ళకు కూడా మీ నాన్నమ్మ, మీ తాత, మీ ఊరు, మీ ఇల్లూ అంటూ వాళ్ళే సరిహద్దులు గీచి, హమ్మో మా మనవరాలైతే ఇలా అనేదా అంటూ ఎంత పకడ్బందీగా ఆశ్చర్యపోతారో గదా! అని నవ్వుకుంటూ వుండగానే మొన్న వచ్చినప్పుడు మా అత్తగారు చేసిన హెచ్చరిక గుర్తుకువచ్చింది. అదే చెప్పాను అమ్మతో బాధగా! ఈసారి కూడా ఆడపిల్ల పుడితే ఆపరేషన్ వద్దనీ, మనవడు పుట్టేదాకా ఆగమంటున్నారనీ!

ఏమోనమ్మా! అదంతా మీ ఇష్టం. మూడో పురుడు మాత్రం మేం పొయ్యకూడదు. మా ఖర్చు కానప్పుడు మీరే పాట్లుపడితే మాకెందుకు? గోడకొట్టినట్టు అంది అమ్మ కోడలి ముఖం వైపు, చూశావా నేనెంత ఖచ్చితమో అన్నట్టు చూస్తూ!

గుండెలో ఎవరో గునపం దింపినట్టయింది నాకు! ఎలా అంది అమ్మ. ఎన్నిసార్లు పురిటి నెప్పులు పడతావే అమ్మలూ! అంతమంది పిల్లల్ని ఎలా పెంచుతావే కన్నలూ అంటూ ఆపరేషన్ చేయించుకోవాలనే నా నిర్ణయానికి బలాన్నిస్తుందనుకున్న అమ్మ, నా బరువు బాధల సంగతి మరచి తన సౌలభ్యాన్నే చూసుకుందేమిటి? కన్న తల్లీ కూతుళ్ళ మధ్య కూడా కరకు రూపాయి సంబంధాలేనా! ఆలోచనల వల్ల తల బరువుతో మగతగా అలాగే పడుకున్నాను సాయంత్రందాకా!

ఏవిటే ప్రయాణానికి తలనొప్పి వచ్చిందా అంటూ అమ్మ మళ్ళీ వచ్చి పక్కలో కూర్చుని తలపై చేయి వేయగానే, ఆ దగ్గరతనంలో బాల్యం లభించినట్టయి జరిగిందంతా మర్చిపోయి ఏవో కబుర్లు చెప్తుకుంటూ, అమ్మా! అమ్మమ్మ ఎలా వుందే! అనడిగాను మాటల మధ్యలో. అమ్మ ముఖం నల్లగా చేసుకుని ఏం అమ్మమ్మోనే అమ్మలూ! తొంభై ఏళ్ళొచ్చి మంచానంటిపెట్టుకొని కూడా ఇంకా నా కొడుకూ, నా మనవలూ అంటూ వెంపర్లాడుతుందా! వాళ్ళకామాత్రం ఇంగితం ఉండక్కర్లా? అత్తయ్య తనను ప్రేమగా చూడకపోగా, ఎన్నాళ్ళో ఈవిడకు చేసే ఖర్మ అని తనకు వినపడేలానే అంటుంటే అమ్మమ్మ మాకు చెప్తుకుని ఒకటే ఏడుపు అంటూ కళ్ళొత్తుకుంది.

"పోనీ నువ్వు తీసుకురాకపోయావా అమ్మమ్మను" కావాలనే కొంత హాస్యం ధ్వనించేలా అన్నాను.

ఆ! ఆ! తీసుకువస్తాను! ఆస్తంతా అనుభవించేది కొడుకులున్నూ, చేసేది కూతుళ్ళూనా! నువ్వు నీ అమ్మను తెచ్చుకోలేదా అంటూ రేపు తన అమ్మను తెచ్చుకుంటుంది నా కోడలు. ఎందుకొచ్చిన లంపటమమ్మా! విసురుగా అంటున్న అమ్మ, బయట అన్నయ్య స్కూటర్ ఆగిన శబ్దమవగానే హడావుడిగా లేస్తూ, అన్నయ్య వచ్చినట్టున్నాడు. అమ్మా, కూతురూ కూర్చుని మా ఆవిడ మీద చెప్తకుంటున్నారని అనుకోగలడు అంటూ గబగబా నడుస్తూ వెళ్ళిపోయింది.

పోటు మీద పోటులా వుంది నాకు. జీవితంలో కేవలం ముసలితనంలో తమ భద్రత కోసం ఇంతగా నటించాలా? అయితే ఇంత కంటే బాగా నటించిన అమ్మమ్మ కోరుకుంటుంది భద్రతనా? ప్రేమనా? తాము కోరుకుంటున్న దాన్ని ఖచ్చితంగా పొందలేమనే భయంతో వీళ్లిలా అస్థిరంగా తయారవుతున్నారా?

పితృస్వామ్యపు కుట్ర కాకపోతే – ఎవరు మంచాన పడ్డా చేయాల్సింది ఆడవాళ్ళే అయినప్పుడు, కూతురు కున్న ప్రేమ కోడలికుండదని నమ్ముతూ కూడా కూతుర్లను వేరే ఇంటికి పంపి కొడుకునే ఎందుకు దగ్గరుంచుకొంటున్నారు? ప్రతి విషయం మగవాళ్ళకే లాభంగా వుండేట్టు నియంత్రించుకొని, ఆ పద్ధతిని ఎవరైనా అతిక్రమిస్తే ఇల్లరికం అనే అవమానం ధ్వనించే పేరుపెట్టి, తాము పుట్టి పెరిగిన వాతావరణం, వారసత్వపు ఆస్తి, తమ స్వంతమే అయ్యేట్టు వంశం, ఇంటి పేరు, పున్నామ నరకం, తలకొరివి పెట్టడం, తద్దినం పెట్టడం అంటూ ఏర్పరచిన మాయాజాలంలో, ఏ మాత్రం పరాయీకరణలేకుండా మగవాళ్ళెంత హాయిగా బ్రతికేస్తున్నారు!

తల్లిదండ్రులు పెళ్ళి పేరుతో ఆడపిల్లను కాక, మగపిల్లాడినే బయటకు పంపితే, ఇన్ని వరకట్నపు చావులు వుండవు కదా! వరకట్న వ్యవస్థను ఈ విధంగా ఎందుకు పరిష్కరించడం లేదు అంటే – బలమైన పితృస్వామ్యం వల్లే కదా!

చీకటి పడింది! పూలచెండ్లనుకున్న బంధాలు సాలెగూళ్ళులా తెగిపోతుంటే, పుట్టి పెరిగిన ఇంట్లోనే విశాలమైన ఒంటరితనం, ఏకాకితనం ఆవరించాయి నన్ను. వరండాలో కోళ్ళు పొదుచుకుంటూ ఒకటే గోల చేస్తున్నాయి నా ఆలోచనల్లాగా!

హబ్బబ్బ మాయదారి కోళ్ళు! ఆ పాయతోలిన కోడి పిల్లల్ని బ్రతకనిచ్చేలా లేదు అంటూ గొణుక్కుంటూ వెళ్ళి కోళ్ళను వేరుచేసి వచ్చింది అమ్మ. పాయతోలడం! పసిపిల్లలుగా వున్నప్పుడు రెక్కల క్రింద పొదువుకునే కోడి కొంత వయసు రాగానే వాటిని తన దగ్గరకు రాకుండా వాటి తలలు రక్తం కారుతున్నా పొడుస్తూనే వుంటుంది. అయితే ఈ పాయతోలడంలో జంతువులు లింగ బేధం చూపవు. వాటికి అన్ని పిల్లలూ సమానమే! కానీ చిత్రంగా మనుషులు మాత్రం ఆడపిల్లల్నే పాయతోలతారు. ఈ ఇంటితో మీకేం సంబంధం లేదని తెలిసివచ్చేలా మాటల పోటులతో దూరంగా వుంచే ప్రయత్నం చేస్తారు.

నేనలా ఆలోచిస్తుండగానే దివ్య, నిద్రలో ఉలిక్కిపడి నన్ను హత్తుకుని పడుకుంది. నాకు బెంగ ముంచుకు వచ్చింది. రేపు నాకు పుట్టేది అబ్బాయి అయితే నేనూ ఇలానే తయారవుతానా? నా చిట్టితల్లిని దూరంచేసే ప్రయత్నం చేస్తానా? నేనలా చేయకపోయినా నా చుట్టూ వుండే పెత్తందార్లూ, సమాజమూ అలా చేయమని బలవంతం చేస్తారా? అయ్యో! ప్రతి జంటా ఒక్క బిడ్డతోనే సరిపెట్టుకుంటే ఇలా వేరుచేసే సమస్యా తప్పుతుంది, దేశ జనాభా కూడా తగ్గుతుంది కదా! మరి నేను అలాచేసే అవకాశం లేదే? నేనూ పాయతోలే మనిషినే అవుతానా? అలా కాకూడదు. తెల్లవారుఝామువరకూ ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను.

పొద్దున్నే అద్దంలో మొహం చూసుకుంటే, తన జాతి ప్రాబల్యం కోసం పరాయి జాతిని చంపిన హిట్లర్‌లా కనిపించినా ప్రకృతి సమతుల్యతను కాపాడుతున్నానని సరిపెట్టుకున్నాను.

అమ్మకు చెప్పకుండానే 'అమ్మ దొంగ నీ పుట్టుకా కాదు బెంగా' అని నాలో నేను పాడుకుంటూ స్కానింగ్ సెంటర్ వైపు నడిచాను.

నా నిర్ణయం పరిష్కారమో, పలాయన వాదమో నాకు తెలియదు. ఇప్పుడు నా కడుపులో వుంది ఆడపిల్ల అయితే నా పిల్లల్ని ఎన్నటికీ సమస్యల వైపు పంపి, ప్రేమరాహిత్యంతో వాళ్ళు బాధపడేలా చేయను. ఒక వేళ మగబిడ్డే అయితే పూర్వం నేనెంత వ్యతిరేకిని అయినా – అబార్షన్ చేయించుకుంటాను. నా పిల్లలకైనా ఆడపిల్లలకు విలువ నిచ్చే భావాలు నూరిపోస్తాను. నా చుట్టూ వున్నవాళ్ళు నా పిల్లల్నీ, వారి చింతలేని జీవితాల్నీ చూసి ఆడపిల్లల్నే కనాలనుకునేంత ఆదర్శంగా తయారుచేస్తాను.

స్కానింగ్ సెంటర్ చేరాను. ఇంతకు ముందు ఒక అమ్మాయి వుంది అని చెప్పగానే పెద్ద వివరణ లేకుండానే స్కానింగ్ చేసింది డాక్టర్. పది నిముషాల్లో రిపోర్టు వచ్చింది.

సారీ అమ్మా! ఈసారీ ఆడపిల్లే తల వంచుకుని చెప్పింది డాక్టర్! ఆమె తల ఎత్తి వుంటే నా ముఖంలోని వెలుగు చూసి ఆశ్చర్యపోయేదేమో!

అవును తల వంచుకొనిపోయేవారు, నాలోని వెలుగును చూడలేరు.